క్లుప్తంగా

'బీఆర్‌ఎస్‌కు ఓటమి తప్పదు'

తొగుట(దుబ్బాక): ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం మోసం చేసిందని బీజేపీ షోలాపూర్ ఎమ్మెల్యే సుభాష్ చంద్ర దేశ్‌ముఖ్ అన్నారు. శుక్రవారం మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దళితులను సీఎం చేస్తానన్న కేసీఆర్ తానే ముఖ్యమంత్రి సీట్లో కూర్చున్నారని విమర్శించారు. కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు చంద్రం, జిల్లా ప్రధాన కార్యదర్శి విభీషణ్‌రెడ్డి, నాయకులు రాజు, స్వామిరెడ్డి, మురళి, చంద్రశేఖర్‌గౌడ్, నర్సింహరెడ్డి, శ్రీనివాస్, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ విద్య ఓ వరం



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

కోహెడరూరల్(హుస్నాబాద్): వివిధ కారణాలతో మధ్యలో బడి మానేసిన వారు ఓపెన్ స్కూల్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కోఆర్డినేటర్ వెంకటస్వామి తెలిపారు. మండలంలోని కూరెళ్లలో సర్పంచ్ గాజుల రమేష్ ఆధ్వర్యంలో ఓపెన్ స్కూల్ విద్యా విధానంపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం కోహెడ స్టడీ సెంటర్‌లో అడ్మిషన్లు జరుగుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ గాజుల వెంకటేశ్వర్లు, హెచ్‌ఎం రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చేర్యాల రెవెన్యూ డివిజన్‌కు కృషి చేయాలి



ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

చేర్యాల(సిద్దిపేట): చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించేలా కృషి చేయాలని కోరుతూ జేఏసీ నాయకుడు చందా శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాసరెడ్డికి శుక్రవారం వినతిపత్రం అందించారు. సానుకూలంగా స్పందించిన ఆయన ఎన్నికల కంటే ముందే రెవెన్యూ డివిజన్ ప్రకటన వస్తుందని హామీ ఇచ్చినట్టు వారు తెలిపారు. ఎమ్మెల్సీని కలిసిన వారిలో పొన్నం వెంకటేష్‌గౌడ్, మానస, కూరపాటి నర్సింహులు ఉన్నారు.

కేసీఆర్ పోటీ గజ్వేల్‌కే గర్వకారణం

గజ్వేల్: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో గజ్వేల్ నుంచి సీఎం కేసీఆర్ ముచ్చటగా మూడోసారి పోటీ చేయడం ఈ ప్రాంతానికే గర్వకారణమని గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం గజ్వేల్‌లో ఆయన మాట్లాడుతూ.. 2014లో ఇక్కడ అడుగుపెట్టిన కేసీఆర్ గడిచిన తొమ్మిదేళ్లల్లో అనుహ్యామైన అభివృద్ధికి నాంది పలికారని కొనియాడారు. పార్టీ ప్రయోజనాల దృష్ట్యా కేసీఆర్ గజ్వేల్‌తో పాటు కామారెడ్డిలోనూ పోటీ చేస్తున్నారని.. రెండు చోట్లా భారీ మెజార్టీని సాధించడం ఖాయమన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ గజ్వేల్ మండల ప్రధాన కార్యదర్శి రమేశ్‌గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ప్రవీణ్, నాయకులు నిజామొద్దీన్, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

చేర్యాల తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల నూతన తహసీల్దార్‌గా జోగినపల్లి రాజేశ్వర్‌రావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో చేర్యాల తహసీల్దార్‌గా పనిచేసిన ఆరీఫా బదిలీపై వెళ్లగా ఆమె స్థానంలో హరికిషన్‌ను ప్రభుత్వం బదిలీ చేసింది. అయితే ప్రమోషన్ రావడంతో విధుల్లో చేరలేదు. దీంతో ఖాళీగా ఉన్న స్థానానికి రాజేశ్వర్‌రావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

'యుద్ధభేరి'కి తరలిన యాదవులు

చిన్నకోడూరు(సిద్దిపేట): యాదవ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో రాజకీయ వాటా కోసం హైదరాబాద్‌లో నిర్వహించిన యాదవ యుద్ధభేరి సభకు శుక్రవారం మండలం నుంచి యాదవులు భారీగా తరలివెళ్లారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. జనాభాలో 10శాతం ఉన్న యాదవులకు 20 ఎమ్మెల్యే, 3 లోక్‌సభ స్థానాలు రానున్న ఎన్నికల్లో అన్ని పార్టీలు యాదవులకు కేటాయించాలని డిమాండ్ చేశారు.

ఐక్యతగా నిలిచి.. రోడ్డు నిర్మించి..

ఆదర్శంగా నిలిచిన బస్వాపూర్ రైతులు



పొలాల వద్దకు వెళ్లేందుకు రైతులు ఏర్పాటు చేసుకున్న మట్టి రోడ్డు

జగదేవ్‌పూర్(గజ్వేల్): వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లేందుకు రైతులు సమష్టిగా బాటలు వేసుకున్నారు. ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తున్నారు. జగదేవ్‌పూర్ మండలంలోని బస్వాపూర్‌లో మొత్తం 1,578 ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా.. గ్రామంలో ఎక్కువగా కూరగాయల పంటలు సాగు చేస్తారు. నూతన, ఆధునిక పద్ధతులు పాటించడంలో గ్రామ రైతులు దిట్ట. కూరగాయల పంటలతో పాటు పూలు, పండ్ల తోటలను సాగు చేస్తారు. దసరా, దీపావళికి బస్వాపూర్ బంతి పూలకు డిమాండ్ ఉంటుంది.

పొలాల వద్దకు బాటలు

గ్రామంలో వ్యవసాయ భూములు వద్దకు వెళ్లేందుకు రైతులంతా కలిసి సమష్టిగా బాటలు ఏర్పాటు చేసుకున్నారు. రియల్ వ్యాపారం మూలంగా గ్రామాల్లో గజం భూమికే గొడవలు పెట్టుకుంటున్న సందర్భాలు ఉన్నాయి. కానీ రైతులు పొలాల వద్దకు ట్రాక్టర్, ఎడ్లబండ్లు పోయే విధంగా బాటలు నిర్మించుకున్నారు. రైతులంతా కలిసి తలాకొంత డబ్బులు జమ చేసుకుని మట్టి రోడ్లు పోసుకున్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా నిధులు కేటాయిస్తే మరిన్ని రోడ్లు వేసుకునే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేయించండి



ఎంపీ ప్రభాకర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రాయపోలు(దుబ్బాక)/ మిరుదొడ్డి(దుబ్బాక): మండలంలోని మొండిచింత నుంచి రాయపోలు మండలం బేగంపేట వరకు ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డుకు మరమ్మతులు చేయించాలని దౌల్తాబాద్ మండల ప్రజాప్రతినిధులు ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిని కోరారు. బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రణం శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎంపీపీ సంధ్యతో పాటు ఇందుప్రియాల, మహ్మద్‌షాపూర్, శౌరీపూర్ గ్రామాలకు చెందిన పలువురు ఎంపీని కలిసి విన్నవించారు. రోడ్డు గుంతలమయం కావడంతో ఇబ్బంది పడుతున్నామని, బీటీ రెన్యూవల్ చేయించాలని కోరారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు

రాయపోలు మండల బీజేవైఎం అధ్యక్షుడు గల్వ దయాకర్‌రెడ్డి బీఆర్‌ఎస్‌లో చేరారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన సుమారు 50 మంది బీజేపీ కార్యకర్తలతో కలిసి శుక్రవారం హైదరాబాద్‌లో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. అలాగే అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని రుద్రారం గ్రామానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన పలువురు కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు.

'సమస్యల పరిష్కారంలో విఫలం'

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని ఏఐపీఎస్‌యూ జిల్లా కన్వీనర్ రమేశ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పలు విద్యాసంస్థల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏఐపీఎస్‌యూ కమిటీలను నియమించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా విస్మరిస్తుందని మండిపడ్డారు. కార్యక్రమంలో ఏఐపీఎస్‌యూ నాయకులు రాజు, శేఖర్, ప్రశాంత్, శివపాల్గొన్నారు.

నేడు త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌కు హరీశ్‌రావు శంకుస్థాపన



సిద్దిపేట త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ నమూనా

సిద్దిపేటఅర్బన్: అద్దె భవనంలో కొనసాగుతున్న సిద్దిపేట త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌కు శాశ్వత భవనం నిర్మించేందుకు శనివారం మంత్రి హరీశ్‌రావు శంకుస్థాపన చేయనున్నారు. సిద్దిపేట రాజీవ్ రహదారి సమీపంలో నూతనంగా కలెక్టరేట్, కమిషనరేట్, ఐటీ హబ్, ఇండస్ట్రియల్ పార్కు, రైల్వేస్టేషన్ రావడంతో పట్టణం వేగంగా విస్తరిస్తుంది. దీంతో మంత్రి హరీశ్‌రావు పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు చొరవ చూపారు. శాశ్వత భవన నిర్మాణానికి రంగధాంపల్లి వార్డు పరిధిలో స్థలం కేటాయించగా.. రూ. 4.44 కోట్లు మంజూరు చేశారు.

బీఆర్‌ఎస్‌ను ఓడించి తీరుతాం

సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి



మాట్లాడుతున్న మల్లారెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట): సీఎం కేసీఆర్ పచ్చి అవకాశవాది అని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వామపక్షాల ఆధ్వర్యంలో వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను ఓడించి తీరుతామన్నారు. మునుగోడు ఉపఎన్నికలో వామపక్షాల మద్దతుతో గెలిచి, ఇప్పుడు బీజేపీతో దోస్తీ చేస్తున్నాడని ఆరోపించారు. తొమ్మిదేళ్ల కేసీఆర్ పాలనలో పేదల బతుకులు మారలేదని ఆవేదన వ్యక్తం చేశారు. హామీల అమలు, ప్రజాసమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో పోరాటం నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు బద్దిపడగ కృష్ణారెడ్డి, నాయకులు రాళ్లబండి నాగరాజు, యాదయ్య, ఆరుట్ల దయానంద్, చెరకు వెంకట్‌రెడ్డి, ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు

బెజ్జంకి(సిద్దిపేట): సీఎం కేసీఆర్ దివ్యాంగులకు పెన్షన్లు పెంచి వారి జీవితాల్లో వెలుగులు నింపారని మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. శుక్రవారం బెజ్జంకిలో దివ్యాంగులకు పెరిగిన ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు చేపట్టి దేశంలోనే అగ్రగామిగా నిలిచామని పేర్కొన్నారు. అనంతరం కల్యాణలక్ష్మి చెక్కులు, 58 జీఓ పట్టా సర్టిఫికెట్లను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ లింగాల నిర్మల, జెడ్పీటీసీ కనగండ్ల కవిత, తహసీల్దార్ వెంకట్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ కచ్చు చంద్రకళ, ఎంపీఓ విష్ణు, మండల కోఆప్షన్ సభ్యుడు పాకాల మహిపాల్‌రెడ్డి, సర్పంచ్ మంజుల, ఎంపీటీసీ శారద, తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగులకు పెన్షన్ ప్రొసీడింగ్ అందజేస్తున్న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

రోడ్డు నిబంధనలపై అవగాహన



ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న సీఐ కిరణ్

హుస్నాబాద్: ఆటోల్లో పరిమితికి మించి ప్యాసింజర్లను ఎక్కించవద్దని సీఐ కిరణ్ పేర్కొన్నారు. శుక్రవారం హుస్నాబాద్-సిద్దిపేట రహదారిపై సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకొని వెళుతున్న ఆటోను ఆపి సూచనలు చేశారు. ఈసందర్భంగా ఆటో డ్రైవర్‌కు, ప్రయాణికులకు రోడ్డు నిబంధనల గురించి అవగాహన కల్పించారు. ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించి ఆటోలు నడపాలని సూచించారు.

బీసీలపై చిన్నచూపు తగదు

గజ్వేల్‌రూరల్: జనాభా పరంగా 50శాతానికి పైగా ఉన్న బీసీల పట్ల చిన్న చూపు తగదని బీఎస్పీ నాయకులు పేర్కొన్నారు. బీసీల కోసం పోరాడిన బీపీ మండల్ జయంతిని శుక్రవారం గజ్వేల్‌లో నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. బీసీలకు 27 శాతం రిజర్వేషన్ కోసం పోరాడిన గొప్ప వ్యక్తి బీపీ మండల్ అని కొనియాడారు. జనాభా ప్రతిపాదికన రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు కరుణాకర్, ఓంప్రకాష్, కేతోజి వినోద్, నరేష్, రమణాకర్, మహేందర్, ప్రసాద్, నరేశ్ పాల్గొన్నారు.

మద్దూర్‌లో..

మద్దూరు(హుస్నాబాద్): బీపీ మండల్ జయంతిని మండల యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చెట్కూరి కమలాకర్ యాదవ్, బెక్కల్ సర్పంచ్ బాలరాజు యాదవ్, ఉపసర్పంచ్ బాలయ్య, నాయకులు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



గజ్వేల్: బీపీ మండల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

నిధుల మంజూరుపై హర్షం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయడం హర్షనీయమని అర్చక సమాఖ్య జిల్లా అధ్యక్షుడు కాలకుంట్ల కృష్ణమాచారి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని ఆరు పురాతన ఆలయాల అభివృద్ధికి రూ. 1.98 కోట్ల నిధులు మంజూరు చేశారని తెలిపారు. ఈసందర్భంగా సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావుకు అర్చక సమాఖ్య తరపున కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధిపై పొన్నం వ్యాఖ్యలు సరికాదు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

హుస్నాబాద్: హుస్నాబాద్ నియోజకవర్గం అభివృద్ధి చెందలేదనడం మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ దిగజారుడు తనానికి నిదర్శనమని ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ అన్నారు. శుక్రవారం రాత్రి క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కరీంనగర్ ఎంపీగా ఉన్నప్పుడు ఎన్ని నిధులు తెచ్చారో చూపాలని సవాల్ విసిరారు. రాష్ట్రం వచ్చినప్పటి నుంచి సీఎం కేసీఆర్ నాయకత్వంలో నియోజకవర్గానికి అత్యధికంగా నిధులు తెచ్చి అభివృద్ధి చేశానన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ రాష్ట్రంలోనే ప్రత్యేకంగా నిలబెడుతున్నానని పేర్కొన్నారు. తెలంగాణ కోసం పార్లమెంట్‌లో కొట్లాడిన వ్యక్తిగా పొన్నం ప్రభాకర్‌పై గౌరవం ఉందని.. చిల్లర మాటలతో వ్యక్తిత్వాన్ని దిగజార్చుకోవద్దని హితవు పలికారు.

బస్సుల కోసం విద్యార్థుల ఆందోళన



రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

రాయపోలు(దుబ్బాక): మండలంలోని వడ్డేపల్లి, రామారం గ్రామాలకు ఆర్టీసీ బస్సు రావడం లేదని శుక్రవారం విద్యార్థులు రోడ్డెక్కారు. గజ్వేల్- చేగుంట రహదారి గుర్రాలసోఫా వద్ద ధర్నా చేశారు. తమ గ్రామాలకు బస్సు రాకపోవడంతో కళాశాలలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బంది పడుతున్నామని వాపోయారు. రాస్తారోకోతో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. గజ్వేల్- ప్రజ్ఞాపూర్ డిపో మేనేజర్ సురేఖ, రాయపోలు పోలీసులు అక్కడకు చేరుకుని బస్సు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు.

పురాతన ఆలయాలకు పూర్వ వైభవం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): నియోజకవర్గంలోని ఆరు పురాతన ఆలయాల అభివృద్ధికి సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు రూ.1.98 కోట్లు మంజూరు చేశారు. చిన్నకోడూర్ మండలం సలేంద్రి రామలింగేశ్వర స్వామి ఆలయానికి రూ. 50 లక్షలు, విఠలాపూర్‌లోని విఠలేశ్వరస్వామి ఆలయానికి రూ. 42 లక్షలు, నారాయణరావు పేట మండలంలోని బుగ్గ రాజేశ్వర స్వామికి రూ. 39 లక్షలు, సిద్దిపేట పట్టణంలోని పెద్దమ్మ ఆలయానికి రూ.30 లక్షలు, ఇర్కోడ్ (హనుమంతుపల్లి)లోని పెద్దమ్మ ఆలయ పనులకు రూ. 20 లక్షలు, సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లిలోని మహంకాళి దేవాలయానికి రూ.17.50 లక్షలు మంజూరు చేశారు.

వరలక్ష్మీ నమోస్తుతే..

శ్రావణమాసం శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని జిల్లావ్యాప్తంగా మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పలు దేవాలయాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.



ఆవాలతో వరలక్ష్మీ రూపాన్ని చిత్రించిన రామకోటి రామరాజు



గజ్వేల్‌లోని మురళీకృష్ణాలయంలో..



నంగునూరు: పాలమాకుల వేంకటేశ్వరాలయంలో..



దుబ్బాకటౌన్: అనంతమహాలక్ష్మీ ఆలయంలో..

ఆకట్టుకున్న మాక్ పోలింగ్



ఓటు వేసేందుకు క్యూలో ఉన్న విద్యార్థులు

హుస్నాబాద్: పట్టణంలోని కేరళ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో శుక్రవారం విద్యార్థులకు మాక్ పోలింగ్ నిర్వహించారు. 6వ తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు ఓటు వేసే విధానంపై ఉపాధ్యాయులు వివరించారు. ఆధార్ కార్డు చూపించి పోలింగ్‌స్టేషన్‌కు వెళ్లి ఓటు వేశారు. అంతకుముందు మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, పెరుక భాగ్యరెడ్డి, పున్న లావణ్య బ్యాలెట్ పేపర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బుర్ర రాజేందర్, కరస్పాండెంట్ శైలేందర్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **దరఖాస్తుల ఆహ్వానం**

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని అల్వాల చెప్యాల క్రాస్ రోడ్డులో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం బైపీసీ, ఎంపీసీ గ్రూపుల్లో స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ధనలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీలో 6, బైపీసీలో 8 సీట్లు ఖాళీగా ఉన్నట్టు చెప్పారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఈనెల 28వ తేదీలోపు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

◆ **నేడు సిద్దిపేటలో గద్దర్ సంస్మరణ సభ**

సిద్దిపేటకమాన్: సిద్దిపేట ఎన్‌జీఓస్ భవన్‌లో శనివారం గద్దర్ సంస్మరణ సభను నిర్వహిస్తున్నట్టు నిర్వహణ కమిటీ తెలిపింది. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం వారు మాట్లాడుతూ.. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ కవి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, రచయిత నందిని సిదారెడ్డి, పలువురు ప్రముఖులు హాజరుకానున్నట్టు తెలిపారు.

◆ **నేడు వర్గల్ ఎంపీపీ సమావేశం**

వర్గల్(గజ్వేల్): వర్గల్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ జాలిగామ లత అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మేరీ స్వర్ణకుమారి తెలిపారు. సభ్యులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

◆ **కాంగ్రెస్‌లో చేరికలు**

దుబ్బాకరూరల్: అక్బర్‌పేట- భూంపల్లి మండలంలోని ఎనగుర్తి, చిన్న నిజాంపేట గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్తలు కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఈసందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ఏకకాలంలో రైతుల రుణాలను మాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. సీఎం కేసీఆర్ పూటకో మాట మాట్లాడుతూ ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్నాడని మండిపడ్డారు.

◆ **ఓటు వజ్రాయుధం**

కొండపాక(గజ్వేల్): ఓటు హక్కు వజ్రాయుదమని ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్ అన్నారు. కుకునూరుపల్లి మండల కేంద్రంలో శుక్రవారం ఉచిత ఓటు హక్కు నమోదు ప్రక్రియను ప్రారంభించి మాట్లాడారు. ఓటు హక్కును నమోదు చేసుకునేందుకు ఉచిత ఇంటర్నెట్ సౌకర్యం కల్పించినట్టు తెలిపారు.

◆ **కొరివి కృష్ణస్వామి సేవలు మరువలేనివి**

సిద్దిపేటకమాన్: ముదిరాజులు రాజకీయంగా ఆర్థికంగా ఇంకా ఎదగాల్సిన అవసరం ఎంతైనా ఉందని సిద్దిపేట మున్సిపల్ వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు ముదిరాజ్ అన్నారు. శుక్రవారం ముదిరాజ్ మహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు కొరివి కృష్ణస్వామి జయంతిని సిద్దిపేట ప్రెస్‌క్లబ్ ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కృష్ణస్వామి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ముదిరాజ్ జర్నలిస్టుల సంఘం జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, గౌరవ అధ్యక్షుడు పరమేశ్వర్, జర్నలిస్టులు, ముదిరాజ్ కుల సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

◆ **హుస్నాబాద్‌లో సతీశ్‌కుమార్‌దే గెలుపు**

కోహెదరూరల్(హుస్నాబాద్): హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీష్‌కుమార్ మూడోసారి అధిక మెజార్టీతో గెలుస్తారని బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు ఆవుల మహేందర్ అన్నారు. మండలంలోని పరివేదలో బీఆర్‌ఎస్ గ్రామ సమన్వయ కమిటీని నియమించారు. కార్యక్రమంలో సర్పంచ్ గీతాంతలి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌పాల్గొన్నారు.

◆ **అధికారంలోకి రాగానే పర్మినెంట్ చేస్తాం**



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రెండో ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయనున్నట్లు డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి అన్నారు. శుక్రవారం ఏఎన్‌ఎంలు చేస్తున్న సమ్మెకు మద్దతు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమానపనికి సమాన వేతనం అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజు, నాయకులు దరిపల్లిచంద్రం, సూర్యవర్మ, తదితరులు పాల్గొన్నారు.

◆ **సమస్య పరిష్కారానికి చొరవ చూపండి**

చేర్యాల(సిద్దిపేట): గ్రామ పంచాయతీ నుంచి మున్సిపాలిటీ వరకు 18 ఏళ్లుగా పనిచేస్తున్న పారిశుధ్య, కంప్యూటర్ ఆపరేటర్, సిస్టం మేనేజర్, బిల్ కలెక్టర్లు, వాటర్ మెన్స్, ఎలక్ట్రీషియన్‌గా కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరుతూ శుక్రవారం మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్‌కు కార్మికులు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో కార్మిక సంఘ ప్రతినిధులు గంగాధర్, ప్రభాకర్, వెంకటేశ్వర్లు, కృష్ణ, దామోదర్, ఎల్లమ్మ, కనకతార, రేణుక, మంజుల, తదితరులు పాల్గొన్నారు.

